# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 17, జూన్ 2026


### సింగరేణి బాగుంటేనే

# మనమంతా బాగుంటాం

- ఓపెన్ కాస్ట్ మైనింగ్, ప్రైవేటీకరణ కుట్రలపై ఢిల్లీ, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడుతాం
- ఉచిత విద్య, వైద్యం కోసం పాంచజన్యం పోరాటం
- అన్నలంతా ఇప్పుడు మా పార్టీలోనే ఉన్నారు
- తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత
- శ్రీరాంపూర్‌లో సింగరేణి ఉద్యోగులతో ముఖాముఖి
- మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంపై ఆగ్రహం
- గని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం







**నస్పూర్, జూన్ 16, ప్రభాతవార్త**

సింగరేణి బాగుంటేనే మనమంతా బాగుంటాం అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియాలోని రవీంద్ర ఖని 7 ఇంక్లైన్, ఏరియా వర్క్ షాప్‌ను సందర్శించి ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సింగరేణి బాయిబాట కార్యక్రమంలో భాగంగా అక్కడకు వచ్చిన కవితను సెక్యూరిటీ సిబ్బంది గని లోపలికి అనుమతించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ అనుచరులతో కలిసి బలవంతంగా లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులతో తనకు విడదీయరాని ఆత్మీయబంధం ఉందని అన్నారు. భూగర్భ గనుల్లోకి వెళ్లే ఉద్యోగులకు గాలి, నీళ్లు ఇవ్వాల్సిన బాధ్యత యాజమాన్యానిదేనని, ఇప్పటికీ పాత టెక్నాలజీ వాడుతూ కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వకపోవడం మానవ హక్కుల ఉల్లంఘనేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవించామని, యాజమాన్య వేధింపులు సహించేది లేదని హెచ్చరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి 4 చట్టాలు చేసిందని, లేబర్ కోడ్ చట్టాలు వస్తే కార్మికులకు హక్కులు, యూనియన్లు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగాల్, కేరళ, తమిళనాడు తరహాలోనే తెలంగాణ అసెంబ్లీలోనూ ఈ చట్టాలను అమలు చేయవద్దని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అండర్ గ్రౌండ్ మైనింగ్ ఉంటేనే ఉద్యోగ భద్రత ఉంటుందని, అయితే దాన్ని తగ్గించి ఓపెన్ కాస్ట్ మైనింగ్ పెంచాలని, సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే రెండు బ్లాక్‌లను ఎండీవోకు ఇచ్చి ప్రైవేట్ పరం చేశారని, దాన్ని మరింత విస్తరించే కుట్రలకు వ్యతిరేకంగా ఢిల్లీ, రాష్ట్ర ప్రభుత్వాలతో కొట్లాడుతామని ప్రకటించారు. గతంలో అన్నలు ఉండటంతో అధికారులు పద్ధతిగా వ్యవహరించేవారని, ఇప్పుడు అన్నలు పోయారని మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడితే ఊరుకునేది లేదని, ఆ అన్నలంతా ఇప్పుడు తమ పార్టీలోనే ఉన్నారని హెచ్చరించారు. కార్మికులను వేధించే అధికారులపై కేసులు పెడతామన్నారు. 40 వేల మంది కార్మికులకు 80 వేల క్వార్టర్లు ఉన్నా, రెండు క్వార్టర్లకు ఒకరి చొప్పున ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు. సింగరేణి చరిత్రలో ఇప్పుడిప్పుడే వస్తున్న మహిళా ఉద్యోగులకు సరైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వాళ్లను అన్‌ఫిట్ చేయడం లేదని, నెలకు రెండుసార్లు పెట్టాల్సిన మెడికల్ మిగతా 2లో..



# నాణ్యమైన వైద్యం, అందించాలి

**✳ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నర్సాపూర్(జి), జూన్ 16, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మందుల గది, ఇంజక్షన్ గది, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ విభాగాలు, పలు వార్డులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి సంబంధించిన మందుల నిల్వలు, ఓపీ తదితర రికార్డులను, రిజిస్టర్లను తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది ప్రతిరోజూ సమయపాలన పాటిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. అనంతరం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని కేజీబీవీ వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అధికారులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఆదేశించారు. ప్రతిరోజూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థినులకు పాఠ్యపుస్తకాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. మండలంలోని మోతాక్‌పల్లి గ్రామం సుద్దవాగులో గల ఇసుక రీచ్‌ను కలెక్టర్ పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణా జరగకూడదని, నిత్యం మిగతా 2లో..

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలి

- ✧ తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని సందర్శించిన టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత
- ✧ సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలి
- ✧ హైకోర్టులో వేసిన కేసును యాజమాన్యం బేషరతుగా వెనక్కి తీసుకోవాలి
- ✧ కార్మికుల దీక్షకు సంఘీభావం తెలిపిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 16, ప్రభాతవార్త :**

కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని టీఆర్ఎస్ అధినే కల్వకుంట్ల కవిత మంగళవారం సందర్శించారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని ఆమె అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కట్టే ఉద్దేశం లేకనే మహారాష్ట్ర ముఖ్యమంత్రి పేరుతో సాకులు చెబుతున్నారని విమర్శించారు. వాస్తవానికి 148 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టేందుకు ఒప్పందం సిద్ధంగా ఉన్నట్లు ఆమె అన్నారు. ముఖ్యమంత్రి మాత్రం 150 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టుకట్టాలని కాలయపాన చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని అన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని, యాజమాన్యం హైకోర్టులో దాఖలు చేసిన కేసును బేషరతుగా వెనక్కి తీసుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పేపర్ మిల్లు కార్మికుల హక్కుల సాధన కోసం మిగతా 2లో..

### నేరాల నియంత్రణకు

# కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

**✪ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

**బెల్లంపల్లి, జూన్ 16, ప్రభాతవార్త**

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మంగళవారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న కేసులు, దర్యాప్తు వివరాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హనుక్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ పరిధిలో రోజువారీగా నమోదవుతున్న ఫిర్యాదులు, కేసుల నమోదు విధానం, పెండింగ్ కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, కేసుల దర్యాప్తు పురోగతికి సంబంధించిన ఫైళ్లను మిగతా 2లో..



# సింగరేణి బాగుంటేనే మనమంతా బాగుంటాం

(మొదటిపేజీ తరువాయి)

బోర్డును ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం 335 మందికి నియామక పత్రాలు ఇచ్చినా, ఇంకా 2 వేల మంది ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని పేర్కొన్నారు. గోదావరి వ్యాలీలో ఉన్న బొగ్గును మనకే కేటాయించాలని, కోల్ బ్లాక్స్ కోసం సింగరేణి ప్రైవేట్ సంస్థలతో పోటీ పడే పరిస్థితి లేకుండా ఎక్కువ బ్లాక్‌లు కేటాయించేలా కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి ప్రయత్నం చేయాలన్నారు. తల్లి కాంగ్రెస్‌తో కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని, ఇప్పుడున్న పిల్ల కాంగ్రెస్‌తో కొట్లాడటం పెద్ద విశేషం కాదన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు గనుల వద్ద సమావేశాలు నిర్వహించలేదా అని ప్రశ్నించారు. కార్మికుల సమస్యలపై తాము పర్యటిస్తుంటే పోలీసులు, యాజమాన్యంతో అడ్డుకోవాలని చూడటం సరికాదని, దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం లక్ష్యాలుగా పాంచజన్యం ఐదు అంశాలతో టీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేని స్థితిలో ప్రజలు ఉన్నారని, కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య, వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వమే భరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని రంగాల్లో సమాన హక్కుల కోసం ఫైట్ చేస్తామన్నారు. సింగరేణితో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని, రాబోయే సింగరేణి ఎన్నికల్లో హెచ్ఎంఎస్‌కు మద్దతిచ్చి గెలిపించాలని కోరారు. అనంతరం శ్రీరాంపూర్ బస్టాండ్, సిసిసిలోని హెచ్ఎంఎస్ కార్యాలయం వద్ద పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సిసిసిలోని మున్సిపల్ డంప్ యార్డ్‌ను పరిశీలించి, జనావాసాలకు, ప్రార్థనా మందిరాలకు సమీపంలో ఉన్న దానిని తక్షణమే దూర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి బోడ జనార్దన్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, అధ్యక్షులు తిప్పారపు సారయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వి. అనిల్ రెడ్డి, సెక్రటరీ పొనగంటి అశోక్, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గోసిక అశోక్, వెల్దీ సుదర్శన్, ఆర్.కె 7 పిట్ సెక్రటరీ చెవుల శ్రీనివాస్, సదిరం రాజేంద్ర ప్రసాద్, హెచ్ ఎం ఎస్, టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం వెంటనే చేపట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సిర్పూర్ పేపర్ మిల్లు పునఃప్రారంభం వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని భావించి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని గుర్తు చేశారు. మిల్లులో ఉన్న యంత్రాల విలువ కంటే ఎక్కువ మొత్తాన్ని వెచ్చించి పరిశ్రమను తిరిగి ప్రారంభించారని పేర్కొన్నారు. అయితే మిల్లు ప్రారంభమైన వెంటనే కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం ప్రారంభించారని ఆరోపించారు. మిల్లులో సుమారు 450 మంది మాత్రమే శాశ్వత ఉద్యోగులు ఉన్నారని, కాంట్రాక్ట్ కార్మికుల్లో కూడా ఇతర రాష్ట్రాలకు చెందిన వారే అధికంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ సాధన అనంతరం తీసుకొచ్చిన ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, ఆ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 27 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని, అవి అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల పాత్ర బలహీనపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్మికులు ఇప్పటికే కోర్టులో విజయం సాధించినప్పటికీ యాజమాన్యం మళ్లీ హైకోర్టును ఆశ్రయించడం సరికాదన్నారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలు పొందిన యాజమాన్యం కార్మికుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు. హైకోర్టులో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకుని కార్మికులకు తగిన వేతనాలు, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల తరఫున తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని, యాజమాన్యానికి కూడా కార్మికుల సమస్యలపై లేఖ రాస్తామని కవిత తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ముందుకు వస్తున్న తమకు కార్మికుల ఆశీర్వాదం, మద్దతు అవసరమని పేర్కొన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు.

అత్యుత్తమ ర్యాంకింగ్ వచ్చేలా గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని, పంచాయతీ కార్యదర్శులు విధులకు సకాలంలో హాజరు కావాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని తెలిపారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, గ్రామసభలు నిర్వహించి గ్రామంలో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, పన్నులు సకాలంలో వసూలు చేయాలని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో పంచాయతీ కార్యాలయ భవనం ఉండాలని, ఇందుకు గాను భవనాలు లేని పంచాయితీలలో అనువైన స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. గ్రామాల పరిధిలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. వర్షాకాలం అయినందున ఎలాంటి అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల వృద్ధిని అరికట్టే విధంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గ్రామాలను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని, ఈ నేపథ్యంలో నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.జి.జి. కన్సల్టెంట్ మహేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు

**బజార్‌హత్నూర్, జూన్ 16, ప్రభాతవార్త:**



బజార్‌హత్నూర్ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కానిందే రాజారాం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకచోట చేరి కేక్ కట్ చేసి, ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాజారాం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రగతి బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. బోథ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిరంతరం కృషి చేస్తున్నారని, నియోజకవర్గ ప్రగతికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు అందే ప్రకాష్, జాదవ్ సుభాష్, లక్ష్మణ్, కవిందర్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయ అభివృద్ధికి చేయూతనిచ్చిన డాక్టర్ సంతోష్ రాజ్

**సారంగాపూర్, జూన్ 16, ప్రభాతవార్త:**



మండలంలోని చించోలి (బి), గోపాల్‌పేట్ ఎక్స్ రోడ్డు సమీపంలో పంట పొలాల మధ్య వెలిసిన కర్ని గాడ్ వీర హనుమాన్ మందిర ప్రహరీ, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సంతోష్ రాజ్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఈ ఆలయానికి హనుమాన్ మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి పూజలు చేస్తూ, సేదతీరుతుంటారు. అయితే, ఆలయ ప్రాంగణం చిన్నగా ఉండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని చించోలి (బి) గ్రామానికి చెందిన రాకేష్ అనే భక్తుడు సామాజిక మాధ్యమాల్లో వీడియో ద్వారా వివరించారు. ఈ వీడియోపై సానుకూలంగా స్పందించిన డాక్టర్ సంతోష్ రాజ్.. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణాన్ని విశాలంగా మార్చేందుకు, ఇతర అభివృద్ధి పనులకు తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఆలయ అభివృద్ధి పనులు పూర్తి కావడంతో మంగళవారం డాక్టర్ సంతోష్ రాజ్ తన కుటుంబ సమేతంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ విజ్ఞప్తికి తక్షణమే స్పందించి ఆలయ రూపురేఖలు మార్చిన డాక్టర్ సంతోష్ రాజ్‌కు చించోలి (బి) గ్రామ యువకులు, భక్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆ భగవంతుడు డాక్టర్ కుటుంబానికి ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వారు ఆకాంక్షి ంచారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**వేమనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త**

వేమనపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన మహిళా ఉపాధ్యాయుల నియా మకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి ఎస్. మయూరి తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు పూర్తి ఇంగ్లీష్ మీడియంలో సోషల్, ఎంఎల్టీ సబ్జెక్టులను బోధించేందుకు ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సోషల్ సబ్జెక్ట్‌కు పీజీ, బీఈడ్, టెట్ అర్హతలు తప్పనిసరి కాగా, ఎంఎల్టీ పోస్టుకు ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ లేదా సంబంధిత ఎంఎల్టీ అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తిగా మెరిట్ ఆధారంగానే ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈ నెల 18, 19 తేదీలలో పాఠశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

## నాణ్యమైన వైద్యం, అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ రవాణాను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే వాహనాలను జప్తు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు జరగాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిని వదిలిపెట్టబోమన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా విద్యాశాఖాధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీకాంత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి పుష్పలత, ఆసుపత్రి వైద్యాధికారి ప్రమోద్ చంద్ర రెడ్డి, సర్పంచ్ గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, ఉమామహేశ్వర్, మజర్ భాయ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన కేసుల్లో జాప్యం లేకుండా నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరచాలని ఆదేశించారు. విచారణ, దర్యాప్తు సమయంలో భౌతిక సాక్ష్యాలతో పాటు సాంకేతిక ఆధారాలను కూడా వినియోగించాలని సూచించిన కమిషనర్, నేరాల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. దొంగతనాల నిర్మూలనకు పటిష్టమైన పెట్రోలింగ్ చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలను చైతన్యపరచాలని, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు భద్రత, భరోసా కల్పిస్తూ వారి ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీ అనంతరం పోలీసు అధికారులతో కలిసి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, ఎస్ఐలు పాల్గొన్నారు.

## జిల్లా ఆరోగ్య సేవల మెరుగుదలకు కృషి చేస్తాం

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, జూన్ 16 ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ నరేందర్ రాథోడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య సేవలపై పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సూచికల ఆధారంగా సమీక్షించి, ఆరోగ్య రంగంలో జిల్లాను ముందంజలో నిలిపేలా కృషి చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పౌరునికి నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలు అందించడంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, చైర్మన్ల సహకారంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ప్రభుత్వ వైద్య సేవలు, అత్యవసర సేవల కోసం 108 అంబులెన్స్ సేవల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అలాగే మాతా శిశు సంరక్షణ, టీకా కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధుల నియంత్రణ, క్షయవ్యాధి నిర్మూలన, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాల అమలులో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వైద్యశాఖకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి తెలియజేయాలని, అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ అనిల్, కార్యాలయ పరిపాలన అధికారి విశ్వేశ్వర్ రెడ్డి, డీపీఓ ప్రశాంతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మహ్మద్ రషీద్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, కాకినాడ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలి

## - జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల

**నర్సాపూర్(జి), జూన్ 16, ప్రభాతవార్త:**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే ధ్యేయంగా నర్సాపూర్(జి) మండలం కుస్లీ గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున భారీ కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ జీ.జానకి షర్మిల ఈ తనిఖీల్లో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా, అనుమతులు లేకుండా నడుపుతున్న పలు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. అనంతరం గ్రామస్థులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామం, ప్రతి పౌరుడు నేర నివారణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, సామాజిక మాధ్యమాల లింకుల పట్ల ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు లేదా వ్యక్తులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి..

యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు, గుడుంబా, తెల్లకల్లు వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ఎస్పీ హితవు పలికారు. మత్తు పదార్థాల వల్ల కుటుంబాలు రోడ్డున పడటమే కాకుండా సమాజం నాశనమవుతుందన్నారు.


మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ జీ.జానకి షర్మిల

అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ వినియోగించాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

### గ్రామస్థుల హర్షం

నిర్మల్ జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఒక జిల్లా ఎస్పీ తమ గ్రామానికి తరలివచ్చి, తమతో కలిసి మాట్లాడటంపై కుస్లీ గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ, సబ్ ఇన్స్పెక్టర్లు గణేష్, శ్రీకాంత్, రవీందర్, లింబాద్రి, పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయి

**సారంగాపూర్, జూన్ 16, ప్రభాతవార్త:**

మండలంలోని రైతులకు కావలసిన జీలుగు విత్తనాలు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. వర్షాకాలం సాగు పనుల నేపథ్యంలో పచ్చిరొట్ట ఎరువుగా ఉపయోగపడే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టా దార్ ప్యాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. 30 కిలోల బరువు గల ఒక్కో జీలుగు విత్తనాల బస్తా ధర రూ.2,450గా నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. అర్హులైన రైతులందరికీ ఇవి పంపిణీ చేయబడుతాయని, త్వరగా నిర్దేశిత పత్రాలతో వచ్చి విత్తనాలను తీసుకెళ్లాలని పేర్కొన్నారు.




## ఘనంగా భోథ్ ఎమ్మెల్యే డా. అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలు

**బజార్‌హత్నూర్, జూన్ 16, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో భోథ్ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ సాయన్న, యువజన సంఘం అధ్యక్షుడు డీ. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నియోజకవర్గ ప్రజల వెన్నంటే ఉంటూ, ప్రజల శ్రేయస్సు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన ఎంతో పాటుపడుతున్నారని కొనియాడారు. ముఖ్యంగా ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తున్న కొత్తపల్లి గ్రామస్థుల చిరకాల వాంఛ అయిన బ్రిడ్జి నిర్మాణ పనులను మంజూరు చేయించి, పూర్తి చేసిన ఘనత ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. అనంతరం యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నియోజకవర్గ రైతాంగానికి ఆపద్బాంధవుడిగా నిలిచారని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గొప్ప మనస్తత్వం ఆయన సొంతమన్నారు. తనను నమ్మిన ప్రతి కార్యకర్తకు అండగా నిలిచే నిజమైన ప్రజా సేవకుడు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బత్తిని మురళీకృష్ణ, చట్ల తరుణ్, తాంద్ర రాజు, తడక శ్రీనివాస్, రాజన్న, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

**నేరడిగొండ, జూన్ 16, ప్రభాతవార్త:**

ప్రజా నాయకుడు, బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జన్మదిన వేడుకలను నేరడిగొండ మండల నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆయన నివాసం వద్ద అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలోనే భారీ కేక్ కట్ చేసి, ఆయనకు పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నిరంతరం ఆయురారోగ్యాలతో, దీర్ఘాయుష్షుతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, ప్రగతి కోసం నిరంతరం శ్రమిస్తున్న నిజమైన ప్రజా సేవకుడు అనిల్ జాదవ్ అని వారు కొనియాడారు. ఈ జన్మదిన వేడుకల పురస్కరించుకొని నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆస్నాద్‌లో స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం

**చెన్నూరు, జూన్ 16, ప్రభాతవార్త**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాల పరిపాలన సందర్భంగా మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని అస్నాద్ గ్రామంలో భాజాపా నాయకులు స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద మురుగు కాలువలు, చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో బిజెపి చెన్నూర్ మండల ఉపాధ్యక్షులు బాగె సత్యం, కార్యదర్శి ఇంగిలి సంతోష్,కార్యకర్తలు ఇంగీలి పెద్దస్వామి, శ్రీనివాస్, రాజశేఖర్ పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

### - బాధిత కుటుంబానికి టిడిపి సహాయం

**బెల్లంపల్లి జూన్ 16, ప్రభాతవార్త**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రూరల్ మండలంలోని బట్వాన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన జాడి శ్రీనివాస్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ నాయకులు అండగా నిలిచారు. జూన్ 15 ఉదయం సుమారు 10 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా శ్రీనివాస్ నివాస గృహంలో మంటలు చెలరేగి, క్షణాల్లోనే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. సమీపంలోని ప్రజలు అప్రమత్తమై మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ, అప్పటికే పెద్ద నష్టం సంభవించింది. ఈ ఘటనపై గ్రామపంచాయతీ, ఎలక్ట్రికల్ సిబ్బందికి సమాచారం అందించబడింది. ఇల్లు కోల్పోయిన శ్రీనివాస్ కుటుంబం ప్రస్తుతం ఇంటి ముందు టెంట్ వేసుకొని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ టీ. మణిరాం సింగ్, రూరల్ మండల్ అధ్యక్షుడు రామటెంకి హరి బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యం అందజేసి ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ దళితుడు మరియు వికలాంగుడు అయిన జాడి శ్రీనివాస్‌కు ప్రభుత్వం వెంటనే తాత్కాలిక పునరావాసం కల్పించాలని, అలాగే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోమాస రాజన్న, గోమాస వెంకటేష్, చల్లూరి శేఖర్, రత్నం అరుణ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జూన్ 20 న జాతీయ లోక్ అదాలత్

**చెన్నూరు జూన్ 16, ప్రభాతవార్త**

ఈ నెల 20న చెన్నూర్ పట్టణంలో నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జూనియర్ సివిల్ జడ్జి పర్వతనేని రవి న్యాయవాదులకు సూచించారు. ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రాంగణంలో సమావేశం ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో మరిన్ని సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై బార్ కౌన్సిల్ సభ్యులకు పలు సూచనలు, సలహాలు అందించారు.

## సింగరేణి పెన్షనర్లకు బీమా వరం

**మంచిర్యాల, జూన్ 16 ప్రభాతవార్త**

సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, బొగ్గు గని పెన్షనర్లకు రూ.30 లక్షల ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం మంచిర్యాలలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, సింగరేణి యాజమాన్యం ప్రతినిధుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ, సంఘం పోరాట ఫలితంగానే ఈ బీమా సౌకర్యం సాధ్యమైందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన లేదా సహజ మరణం చెందిన విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలకు ఈ పథకం ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. విశ్రాంత ఉద్యోగులకు బీమా సౌకర్యం కల్పించడంలో సహకరించిన బ్యాంకుల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విశ్రాంతి కార్మిక సంఘం నాయకులు

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి

**ఆసిఫాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :**


సంఘం నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టీయూడబ్ల్యూజే ఐజేయు నాయకులు

జర్నలిస్టుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే ఐజేయు) పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సంపత్ కుమార్ లు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్ నిరంతరం పోరాడుతుందని భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడేషన్ కార్డులు ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా యూనియన్ తరపున చూస్తామన్నారు. జర్నలిస్టుల హక్కుల రక్షణకు టీయూడబ్ల్యూజే ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. జిల్లాలోని జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి, ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. యూనియన్ బలోపేతంతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అక్రిడేషన్ కమిటీ మెంబర్ ప్రకాష్ గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అడప సతీష్, టీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి దేవునూరి రమేష్ , ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, టీయూడబ్ల్యూజే ప్రతినిధులు, జర్నలిస్టులు మేకల శ్రీనివాస్, సురేష్ చారి, భాస్కర్ చారి, రాధాకృష్ణ చారి, నితీష్ కుమార్, జానకిరామ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, తిరుపతి, కిషోర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## వంతెనకు మరమ్మతులు చేయాలి

**లింగాపూర్, జూన్ 16, ప్రభాతవార్త,**

మండలంలోని లొద్దిగూడ గ్రామ సమీపంలో వంతెన తీవ్రంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. వంతెనపై గుంతలు ఏర్పడి బలహీన పడటంతో ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో సమీప వాగు ఉధృతంగా ప్రవహిస్తే వంతెన కొట్టుకుపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం సంభవించే లోపు అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని తొడసం భగవంతురావు, జాదవ్ బాబులాల్, కుమ్ర కాంతారావు తదితరులు కోరుతున్నారు.

## కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలు

**ఆసిఫాబాద్ టౌన్, జూన్ 16, ప్రభాతవార్త :**

కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు మారాయని లైబ్రరీ చైర్మన్ కామ్డే.అనిల్ కుమార్ ఎంఈఓ సుభాష్లు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం అంటే ఒక దేవాలయంలో చదువు తున్నట్లుగా ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వాళ్లు మాత్రమే ఉపాధ్యాయులుగా అవకాశం దక్కుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదవడం అంటే గొప్ప అవకాశమని పిల్లలకు వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రస్తుతం ప్రజాపాలనలో విద్యార్థులకు మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం భోజనం, స్టూడెంట్ కిట్ ఇలా అనేక రకాల సౌకర్యాలు సదుపాయాలు పిల్లలకు అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ పట్ల కూడా ప్రోత్సకాలు అందిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు కూడా మీ కుటుంబంలో ఉన్న మీ బంధుమిత్రులకు ప్రభుత్వ పాఠశాలకు రావాలని, తల్లిదండ్రులు సైతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపే విధంగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుష్పలత, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## నాణ్యమైన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 16, ప్రభాతవార్త**



గ్రామస్థాయి నుండి అభివృద్ధి దిశగా నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి గ్రామ అభివృద్ధి ప్రణాళిక పై డివిజనల్ పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. ఈ శిక్షణలో 16వ ఆర్థిక సంఘం నిబంధనలు, పెసా గ్రామపంచాయతీలు, సభాసర్ ,నిర్ణయ్ యాప్, ఈ గ్రామ స్వరాజ్ అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.




## నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్, పోలీసులు దాడులు

**దహెగాం, జూన్ 16,ప్రభాతవార్త :**

దహెగాం మండలంలో కల్వాడా గ్రామంలోని నాటుసారా స్టావారాలపై ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం పానకం, 15లీటర్ల గుడుంబా ను స్వాధీన పరుచుకొని కల్వాడా గ్రామానికి చెందిన ధారవాత్ కళావతి, దారావత్ నీలాబాయి, ఇస్లావత్ లలిత ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కాగజ్ నగర్ ఎక్సైజ్ సి ఐ వి రవి తెలిపారు. మద్యం వాళ్ళ కలిగే నష్టాలపై గ్రామ ప్రజలకు అవగాహనా కల్పించారు. దాడులలో ఎక్సైజ్ ఎస్ ఐ సురేష్, దహెగాం ఎస్ ఐ రమేష్, సిబ్బంది ఉన్నారు.


వైష్ణవిని అభినందిస్తున్న దృశ్యం

## తిర్యాని మండల ఎస్ఎస్సి టాపర్‌కు సన్మానం

### - వైష్ణవికి నగదు బహుమానం అందజేసిన ఎంఈఓ

**తిర్యాని, జూన్ 16, ప్రభాతవార్త :**

తిర్యాని మండలంలో పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండల టాపర్గా నిలిచిన తిర్యాని జడ్పి పాఠశాలకు చెందిన విద్యార్థిని గుండ వైష్ణవిని మండల విద్యాశాఖ అధికారి కె అంజయ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి వైష్ణవికి నగదు బహుమానం అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థిని సాధించిన విజయాన్ని ప్రశంసించిన ఎంఈఓ, కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. వైష్ణవి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అమరెందర్ రెడ్డి, శ్రీనివాస్, తిరుపతి, దత్తు మూర్తి,లవన్ కుమార్, సోమ శేఖర్, మంజుల, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో రాయితీ విత్తనాలు

**ఆసిఫాబాద్, జూన్ 16, ప్రభాతవార్త :**



పత్తి పంట సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలు, రసాయనాలు జిల్లాలోని రైతులకు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి పంటలో ఉత్పత్తి, దిగుబడులను గణనీయంగా పెంపొందించే ఉద్దేశంతో రానున్న 5 సంవత్సరాలకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీపై పత్తి విత్తనాలు సాంద్ర పద్ధతిలో నాటి దిగుబడి పెంచుటకు నూతన పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. రైతులు అధిక సాంద్ర పద్ధతిలో ఎకరానికి 6 విత్తన ప్యాకెట్లు వినియోగించాలని, దగ్గర దగ్గరగా పద్ధతిలో 4 విత్తన పాకెట్లు వినియోగించవచ్చని, సమగ్ర పంటల యాజమాన్య పద్ధతిలో విత్తనాలు నాటి అధిక దిగుబడి పొందవచ్చని తెలిపారు. రైతులు రాయితీ ద్వారా విత్తనాలు, రసాయనాలు పొందడంతో పాటు అవసరమైన సలహాలు, సూచనలు పొందవచ్చును తెలిపారు.

## నూతన జిల్లా విద్యాధికారికి ఘన సన్మానం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :**

నూతనంగా కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సచ్చిదానంద చారి తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు పర్వ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ తరఫున నూతన డీఈఓకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా విద్యాభివృద్ధికి ఆయన సేవలు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏఓ జాడి దేవాజీ, మండల విద్యాధికారులు మధుకర్, శివచరణ్, ఎస్. వెంకట్రాజయ్య, ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


నూతన జిల్లా విద్యాధికారిని సన్మానిస్తున్న గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం

# చిన్న వయసులోనే నగర కాంగ్రెస్ సారథి..

## ప్రజాసేవలో తనదైన ముద్ర వేసిన తూముల నరేష్ * జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడిగా, 14వ డివిజన్ కార్పొరేటర్‌గా విశేష సేవలు

మంచిర్యాల, జూన్ 16, ప్రభాతవార్త

**చిన్న వయసులోనే ప్రజా సేవను లక్ష్యంగా చేసుకుని రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నాయకుడు మంచిర్యాల నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్, జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు తూముల నరేష్. ప్రజల సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం, కార్మిక సంక్షేమం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ యువ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు.**

### నగర కాంగ్రెస్ పార్టీకి యువ సారథి..

నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తూముల నరేష్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో విశేష కృషి చేస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, కార్యకర్తలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ శ్రేణుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. ప్రజల మధ్య ఉండే నాయకుడిగా మంచి గుర్తింపు పొందారు.

### రికార్డు మెజార్టీతో కార్పొరేటర్‌గా విజయం..

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 14వ డివిజన్ కార్పొరేటర్‌గా రాష్ట్రంలోనే రెండో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన తూముల నరేష్ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆయన చూపుతున్న చొరవ ప్రజల ఆదరణను మరింత పెంచింది.

### ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుకు కుడిభుజంగా..

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మార్గదర్శకత్వంలో నగర అభివృద్ధికి తూముల నరేష్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఎమ్మెల్యే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో ముందుంటున్నారు. పార్టీ శ్రేణులు, ప్రజల మధ్య ఎమ్మెల్యేకు కుడిభుజంగా వ్యవహరిస్తూ విశేష కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.



### ఆటో కార్మికుల సంక్షేమానికి అంకితం..

జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ప్రమాద బీమా, సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లడం, అవసరమైన సందర్భాల్లో ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాల ద్వారా ఆటో కార్మికుల మన్ననలు పొందుతున్నారు.

### సామాజిక సేవలో ముందంజ..

కరోనా కాలం నుంచి ఇప్పటి వరకు పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ, వైద్య సహాయం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో బాధితులకు అండగా నిలవడం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పండుగలు, జాతీయ దినోత్సవాల సందర్భాల్లో కూడా ప్రజలతో కలిసి సేవా కార్యక్రమాలు చేపడుతూ సామాజిక బాధ్యతను చాటుకుంటున్నారు.

### యువతకు ఆదర్శంగా..

ప్రజా సేవే నిజమైన రాజకీయమని విశ్వసించే తూముల నరేష్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం, క్రీడలు, విద్య, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది.

### భవిష్యత్ నాయకత్వంపై ఆశలు..

రాజకీయ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా, కార్మిక నాయకుడిగా, సామాజిక సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞను చాటుకుంటున్న తూముల నరేష్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఆకాంక్షిస్తున్నారు. ప్రజలతో మమేకమై అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న తూముల నరేష్ ప్రస్తుతం మంచిర్యాల రాజకీయాల్లో యువ నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి కొనసాగిస్తానని ఆయన తెలిపారు.

## ఎస్పీయం పేపర్ మిల్లులో కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ రిలే నిరాహార దీక్షలు

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :

ఎస్పీయం పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలను వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 28వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన కార్మిక నాయకుడు వెంకటేశం మాట్లాడుతూ, గత 28 రోజులుగా కార్మికులు నిరవధిక రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ యాజమాన్యం మొండి వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వ కార్మిక శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకుని ఎస్పీయంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే కార్మికులకు మద్దతుగా అందరూ ముందుకు వచ్చి రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని సంఘీభావం తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు దీక్షలో వల్లాల సుభాష్, కొమ్ము చక్రవర్తి, పి. సత్యనారాయణ, పి. వెంకటేష్, అబ్దుల్ నబీ, ఎం. శంకర్ పాల్గొన్నారు. దీక్షకు జేఏసీ నాయకులు గోగర్ల రాములు, అశ్విని కుమార్ సింగ్, అంబాల ఓదెలు, కలికోట రమణయ్య, బింగి రమేష్, జె. వెంకటేష్, తాటి వెంకటేష్, తన్నీరు పోచం, శీలం రాజమౌళి, రాజేష్ యాదవ్, గడపల మహేష్, చంద్రశేఖర్, శ్రీరాములు, బడుగు భూమయ్య, మోర్లె నానాజీ, కూషణ రాజన్న, జిల్లా రాఘవులు తదితరులు హాజరై సంఘీభావం ప్రకటించారు. కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.





## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

### - ఎంఈఓ వాసాల ప్రభాకర్
### - ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం

కాగజ్‌నగర్ రూరల్, జూన్ 16, ప్రభాతవార్త :

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సి బాబు బస్తి పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమము నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కాగజ్ నగర్ మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. గౌరవ కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం ఈ విద్యా సంవత్సరం ప్రతి పాఠశాలలో కనీసం 10 శాతం విద్యార్థులను అదనంగా చేర్పించాలని సూచించారు. అనంతరం పూర్వ మిత్రుల సహాయంతో విద్యార్థులకు బ్యాగులు మరియు 21 వస్తువులతో కూడిన కిట్లను విద్యార్థులందరికీ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు అనురాధ భాయి, సీనియర్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పవన్ కుమార్, ఉపాధ్యాయులు మహేష్, సురేందర్, సి ఆర్ పి అర్జున్, పంచాయతీ సెక్రెటరీ హరీష్, ఎం ఆర్ సి సిబ్బంది మహేష్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ నెట్‌వర్క్ బలోపేతం, వినియోగదారులకు మెరుగైన సేవలు

### - టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నిర్మల్, జూన్ 16, ప్రభాతవార్త:



11 కేవీ, 33 కేవీ ఫీడర్లలో ట్రిప్పింగ్‌లను సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు ప్రస్తుత విద్యుత్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని టీ జీ ఎ న్ వీ డీ సీ ఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అధికారులను ఆదే శించారు. మంగళ వారం నిర్మల్ జిల్లా విద్యుత్ అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. నిర్మల్ టౌన్, రూరల్ ఉపవిభాగాల సాంకేతిక, వాణిజ్య పనితీరును పరిశీలించి పలు కీలక సూచనలు చేశారు. వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని హెచ్‌టీ, ఎల్‌టీ లైన్ల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. అవసరమైన చోట మధ్యంతర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో పాటు లైన్‌లలోని లోపాలను సరిదిద్దాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించేందుకు అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో స్పేసర్లు అమర్చాలని, ఓవర్‌లోడ్ అయిన ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని స్పష్టం చేశారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లోని 11 కేవీ ఫీడర్లపై లైట్నింగ్ అరెస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి సిబ్బంది విధి నిర్వహణలో తప్పనిసరిగా భద్రతా పరికరాలను ఉపయోగించేలా చూడాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను నమోదైన తేదీ నుంచి రెండు నెలల వ్యవధిలోపు సకాలంలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. సాంకేతిక ప్రమాణాల పాటింపు, వాణిజ్య పనితీరు మెరుగుదల, వినియోగదారుల సంతృప్తి పెంపే సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నిర్మల్ ఆపరేషన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, డివిజనల్ ఇంజనీర్, టౌన్, రూరల్ ఉపవిభాగాల అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జూన్ 16, ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్యలతో కలిసి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని తెలిపారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో కృషి చేసి మొక్కలు నాటి సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదిగా వన మహోత్సవం కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, అదే రోజున జిల్లాలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. 2026 వనమహోత్సవం లో భాగంగా జిల్లాలో 41 లక్షల మొక్కలు నాటడానికి లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా నర్సరీలలోని మొక్కల వివరాలను, ప్లాంటేషన్ చేసే సైట్ల రిజిస్ట్రేషన్, సంబంధిత వివరాలను కేటాయించబడిన ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. మొక్కలు నాటడంలో సంబంధిత అధికారులకు అటవీ అధికారులు సహాయం అందిస్తారని, మొక్కలు నాటిన తర్వాత జియో ట్యాగింగ్ పూర్తి చేసి, రోజువారీగా వివరాలను నవీకరించాలని తెలిపారు.



రహదారులకు ఇరుప్రక్కల పెద్ద చెట్లు నాటాలని, నాటిన ప్రతి ఒక్క మొక్క ఎదిగేలా సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ఆవరణలో పూలు, పండ్ల మొక్కలు నాటాలని, జిల్లాలో గనులు దృష్ట్యా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నాయని, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటడం ద్వారా ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయని తెలిపారు. అటవీ భూముల తగాదాలు ఉన్నచోట వెదురు మొక్కలను నాటాలని, ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వాటిని ఎప్పటికప్పుడు తొలగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నేటి నుంచి లక్ష మందికి అల్పాహారం

## - వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనందరావు పటేల్

**భైంసా, జూన్ 16, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని మంజీరి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆనందరావు పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని, ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు ఉదయం పూట నాణ్యమైన అల్పాహారం కూడా అందించాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఈ పథకం ద్వారా విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, వారిలో చదువుపై మరింత ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి సంక్షేమ కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు మృతి

## - మరొకరి పరిస్థితి విషమం

**దిలావర్‌పూర్, జూన్ 16, ప్రభాతవార్త:**



నిర్మల్‌భైంసా ప్రధాన రహదారిపై దిలావర్‌పూర్ గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఈవీ స్కూటీని ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. మంజులాపూర్ గ్రామానికి చెందిన ఉప్పుల గణేష్, దిలావర్‌పూర్‌కు చెందిన ముజ్జి ముత్యం వ్యవసాయ పనులు ముగించుకొని దిలావర్‌పూర్ నుంచి నిర్మల్ వైపు ఈవీ స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం స్కూటీని బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఉప్పుల గణేష్ అక్కడికక్కడే మృతి చెందారు. ముజ్జి ముత్యంకు తల, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్ సహాయంతో మృతదేహాన్ని, క్షతగాత్రుడిని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ముత్యం పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు దిలావర్‌పూర్ పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టామని, హైవేపై ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

# గర్భిణీలు, చిన్నారుల సంక్షేమంపై కమిటీ చర్చ

## - జాజులపేట అంగన్వాడీ కేంద్రంలో కమిటీ ఏర్పాటు

**వేమనపల్లి, జూన్ 16, ప్రభాతవార్త**



సుంపుటం గ్రామపంచాయతీ పరిధిలోని జాజులపేట గ్రామ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం అంగన్వాడీ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సమావేశానికి సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి అధ్యక్షత వహించారు. కేంద్రం నిర్వహణ, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలపై చర్చించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రం ద్వారా అందజేసే పోషకాహార సరుకులు, పాలు, గుడ్లు, బియ్యం, నూనె, బాలామృతం తదితర వస్తువులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు మానేపల్లి లక్ష్మి, ఆశా వర్కర్ కొండ్ర శారద, వీఓ ప్రతినిధి మమత, అంగన్వాడీ టీచర్ దుర్గం కళావతి, వర్కర్ రమాదేవి, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఏఐ శిక్షణ తరగతులు

**భైంసా, జూన్ 16, ప్రభాతవార్త:**



భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు 2 క్రెడిట్ల కృత్రిమ మేధస్సు (ఏఐ)పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. నిర్మల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు పి.స్వాతి మాస్టర్ ట్రైనర్‌గా హాజరై, ఏఐ ప్రాముఖ్యత, భవిష్యత్ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘునాథ్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో విద్యార్థులు ఏఐ సాంకేతికతను నేర్చుకుని నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. రెండు రోజుల మాస్టర్ ట్రైనర్ శిక్షణ అనంతరం, ఇక్కడ నేర్చుకున్న విద్యార్థులు జూలై 1 నుండి 15 రోజుల పాటు ప్రభుత్వ పాఠశాలల్లో "అన్న అక్క మెంటర్షిప్" ద్వారా పాఠశాల పిల్లలకు ఏఐపై అవగాహన కల్పిస్తారని కళాశాల వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ఏఐ కోఆర్డినేటర్లు డాక్టర్ కల్పన, డాక్టర్ జె.ఓం ప్రకాష్, కె.దివ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతీ శిశు మందిరంలో ఘనంగా గాయత్రీ యజ్ఞం

**భైంసా, జూన్ 16, ప్రభాతవార్త:**



భైంసా పట్టణంలోని గుజరీగల్లీ శ్రీ సరస్వతీ శిశు మందిరంలో మంగళవారం గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైన సందర్భంగా పాఠశాలను అందంగా అలంకరించి, సాంప్రదాయబద్ధంగా పూలు చల్లుతూ చిన్నారులకు, విద్యార్థులకు ఆచార్యులు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. పాఠశాల ఆవరణ అంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ సందర్భంగా నూతనంగా పాఠశాలలో చేరిన చిన్నారులకు కమిటీ సభ్యులు, ఆచార్యులు సాంప్రదాయబద్ధంగా అక్షరాభ్యాసం చేయించి, తీపి ప్రసాదాన్ని అందజేశారు. ఆటపాటలతో చిన్నారులను అలరిస్తూ తరగతుల్లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శిశు మందిర్ జిల్లా కార్యదర్శి పురస్తు గోపాల్ కిషన్, పాఠశాల సమితి అధ్యక్షులు శివకుమార్ బచ్చువారు, తోట రాము, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు, పాఠశాల సహకార్యదర్శి పెరుగు నవీన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్య హక్కా..? వ్యాపారమా..? అంశంపై నేడు చర్చా వేదిక

**మంచిర్యాల, జూన్ 16, ప్రభాతవార్త**

విద్య రంగంలో పెరుగుతున్న వ్యాపార ధోరణులు, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ అవసరంపై చర్చించేందుకు నవతరం విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ హర్ష డిగ్రీ కళాశాలలో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ పటేల్ తెలిపారు. కార్పొరేట్‌లను తొలగించాలి ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలి అనే నినాదంతో విద్య హక్కా? వ్యాపారమా? అనే అంశంపై ఈ సమావేశం జరగనుందని పేర్కొన్నారు. జిల్లాలోని మేధావులు, విద్యార్థి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. అలాగే ప్రజా సమస్యలకు సంబంధించిన ఈ కార్యక్రమానికి వార్తా మాధ్యమాల ప్రతినిధులు హాజరై సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# పుట్టినరోజు వేడుకల కోసం వెళ్లి అనంతలోకాలకు..

## - రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**జన్నారం, జూన్ 16, ప్రభాత వార్త**

పుట్టినరోజు వేడుకలకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరగడంతో జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన రాకేష్ (22) మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదం నింపింది. చింతగూడ గ్రామానికి చెందిన గుండ మల్లేష్, సుజాత దంపతుల పెద్ద కుమారుడు రాకేష్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ చదువుతున్నాడు. మంగళవారం రాకేష్ పుట్టినరోజు కావడంతో స్నేహితులు సోమవారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత కేక్ కట్ చేయాలని చెప్పారు. దీంతో బైక్‌పై స్నేహితుల వద్దకు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై రాకేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారితే పుట్టినరోజు అనే సంబరం కాస్త విషాదంగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు. మల్లేష్ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో రాకేష్ పెద్దవాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



